



నేడు మీ వాడిని: గొల్లప్రోలు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివాదం

నువ్వు చల్లగుండాలయ్యా: వృద్ధురాలి ఆశీర్వాదం

పింఛన్.. ఆనందించెన..

	తూర్పుగోదావరి	అంబేద్కర్ కోనసీమ	కాకినాడ
లబ్ధిదారులు :	2,41,771	2,43,534	2,79,319
అందుకున్నవారు :	2,32,840	2,33,944	2,62,423
మొత్తం శాతం :	96.31	96.06	93.95




గొల్లప్రోలులో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్


సామర్లకోటలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కాకినాడలో మహిళలకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమాడి


కాకినాడ రూరల్‌లో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ


ప్రత్తిపాడులో వృద్ధుడికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ


జగ్గంపేటలో వృద్ధుడికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల


తునిలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

కూటమి తొలి అడుగే.. సూపర్‌హిట్

- ఇంటి వద్దనే రూ.7 వేలు అందెన్
- పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 2,62,423 మందికి అందజేత
- పంపిణీ చేసిన మొత్తం 177.01 కోట్లు
- ఉదయం 5 గంటలకు ఆరంభం
- రాత్రి 10 గంటల వరకు సాగిన పంపిణీ
- ప్రభుత్వ ఉద్యోగులకు అభినందన

పిఠాపురం/కలెక్టరేట్ జూలై 1: కూటమి వచ్చింది.. ఇంటింటా ఆనందం తెచ్చింది.. హామీలు ఇచ్చారు.. ఎలా చేస్తారో చూస్తాం అంటూ గత పాలకులు చేసిన విమర్శలకు ధీటుగా పింఛన్ల పంపిణీ సాగింది.. వలంటీర్లు లేకపోయినా తొలిరోజే ఏకంగా 93.95శాతం పింఛను పంపిణీ చేసి చూపించారు.. శెహబాస్ అనిపించుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఓ పండుగలా సాగింది. ఉదయం 6 గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు చేరుకున్న సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అవ్వాతాతలు, దివ్యాంగులు, కళాకారులను లేపి పింఛన్లు అందజేశారు.

ఒక్కరోజులోనే 93.95 శాతం..

గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా 1 నుంచి 5వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏకంగా ఒకే ఒక్క రోజులో 93.95 శాతం పింఛన్లు పంపిణీ చేసి అభాగ్యుల గుండెల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఊళ్లో లేనివారి, ఇతర కారణాల వల్ల బయట ఉన్నవారికి తప్ప మిగతా వారందరికీ పింఛన్లు అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల జోక్యం వద్దని ఎన్నికల కమిషన్, కోర్టు ఆదేశించడంతో గత వైసీపీ ప్రభుత్వం రెండు నెలలపాటు పింఛన్‌దారులకు చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించారు. వలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జరగదని.. సచివాలయ ఉద్యోగులవల్ల సాధ్యం కాదని తేల్చేశారు. పింఛన్ల పంపిణీలోనూ ఓటు రాజకీయం చేశారు. పింఛను సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో వేసి పింఛన్‌దారులకు నరకం చూపించారు. పైగా ఈ నెపాన్ని చంద్రబాబుపై తోయడానికి వైసీపీ విశ్వప్రయత్నం చేసింది. అప్పటికే ఎన్నికల ప్రచారం నిమిత్తం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న చంద్రబాబు అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను పింఛన్ రూ.4వేలు చేయడంతోపాటు ఏప్రిల్ నుంచే అమలు చేసి, జూలై 1న రూ.7వేలు ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన తన మాటను నిలబెట్టుకున్నారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు పోటీ పడ్డారు. పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఉన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పెద్దాపురంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడులో వరుపల సత్యప్రభ, తునిలో యనమల దివ్య, ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పింఛన్లు పంపిణీ చేశారు.

ఒక్కరోజే 2,62,423 మందికి అందజేత

జిల్లాలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు 93.95శాతం పంపిణీ చేసినట్టు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 5 గంటలకే ప్రారంభించినట్టు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 627 గ్రామ, వార్డు సెక్రటేరియేట్‌ల పరిధిలో 6200మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేశారన్నారు. నగదుతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశలేఖను అందజేశారు. జిల్లాలో మొత్తం 2,79,319మంది సామాజిక పెన్షన్‌దారులు ఉన్నారు. వీరికి ఈనెల పెంచినది.. కొందరికి అదనంగా ఇచ్చిన రూ.3వేలు కలిపి మొత్తం రూ.188.39కోట్లు ఇవ్వాల్సిఉంది. సోమవారం ఒక్కరోజే 2,62,423మందికి 93.95 శాతంతో రూ.177.01కోట్లు పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రంలోపు మిగిలిన వారందరికీ పింఛన్లు పంపిణీ చేసే ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. తొలిరోజే 94శాతం వరకు లక్ష్యాన్ని పూర్తిచేసిన సచివాలయ ఉద్యోగులను అభినందిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10గంటల వరకూ సర్వర్ బాగానే పనిచేసినా తదనంతరం పలుప్రాంతాల్లో సర్వర్ మొరాయించడంతో ఇబ్బందులు తలెత్తాయి. మధ్యాహ్నం 3గంటల తర్వాత సర్వర్‌లో తలెత్తిన లోపాలను సరిచేయడంతో వేగంగా పంపిణీ జరిగింది. పలుచోట్ల రాత్రి 10గంటల వరకు కూడా పింఛన్లు అందజేశారు.

ఉదయం 5 గంటలకే ఆరంభం..

సోమవారం ఉదయం 5గంటలకు మొదలైన పింఛన్ల పంపిణీ పండగా ఉదయం 8.30 గంటలకే 45 శాతం దాటేసింది. ఇది ఒక జాతరలా సాగింది. కానీ సర్వర్లు డౌన్ కావడం వల్ల సుమారు రెండు గంటల పాటు ఇబ్బంది ఏర్పడింది. అయినా చంద్రబాబు భరోసాను ఓ చాలెంజ్‌గా తీసుకున్న సచివాలయ, ఇతర ఉద్యోగులు టిఫిన్ కూడా మానేసి పింఛన్ల పంపిణీపైనే దృష్టి సారించారు.కొందరు మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు.జిల్లా యంత్రాంగం పగడ్బంధీ ఏర్పాట్లు చేయడంతో పాటు శనివారం సాయంత్రమే పంపిణీకి సంబంధించిన సొమ్మును ఉద్యోగులకు అందజేసింది. దీని వల్ల వారు ఇళ్లకు తీసుకుని వెళ్లి రూ.7వేలు, రూ.6వేలు, రూ.10వేలు, రూ.15 వేలు వంతున వేర్వేరు కట్టలుగా కట్టుకుని సిద్ధం చేసుకున్నారు.దీంతో పంపిణీ సులభమైంది. ఉద్యోగులకు తోడుగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అన్ని చోట్ల భాగస్వాములయ్యారు.


పింఛన పెంపుపై పంపిణీ పార్టం పత్రం చేస్తూ తాళ్లరేవులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మహిళలు




గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

- పనిచేసే..మన్ననలను పొందుతా
- రక్షణ పేరుతో ఆంక్షలు వద్దు
- స్థలం చూస్తున్నా.. ఇల్లు కట్టుకుంటా
- ఉపాధిని మెరుగుపరుస్తా
- పింఛన్ల పంపిణీ సభలో పవన్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందన్నారు. కొత్తపల్లి మండలంలోని సముద్రపు తీరప్రాంతాల్లో తాగునీటి కోసం అక్కడ మహిళలు పడుతున్న కష్టాలను తాను స్వయంగా చూశానని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లోని కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ నూరు శాతం శానిటేషన్ చేయడంతో పాటు ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం చేద్దామని భావిస్తున్నట్టు తెలిపారు. నా నియోజకవర్గంలో సక్సెస్ అయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అదే మోడల్‌లో శానిటేషన్ చేయిస్తామన్నారు. ప్రజలను, పోలీసులను, అధికారులను ఇబ్బందులు పెట్టి విజయయాత్ర చేయాలనుకోలేదని, పనిచేసిన తర్వాతే తనకు విజయయాత్ర అని స్పష్టం చేశారు. పనిచేసి మన్ననలు పొందితేనే తనకు ఆనందం. అప్పుడే నేను ఎమ్మెల్యేను అయ్యాను అన్న ఆనందం కలుగుతుందని తెలిపారు. ఎక్స్‌పర్ట్‌లను తీసుకువచ్చి పిఠాపురానికి మేలు చేసే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో 40,765 మందికి పింఛన్ల రూపేణా రూ.27.34 కోట్లు అందజేస్తున్నామని చెప్పారు. వారం విడిచి వారం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు ఇక్కడే ఉండి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. దివ్యాంగులకు 40 శాతం వికలాంగత్వం ఉంటేనే పింఛన్ అందుతోందని, ఇందులోనూ ఎన్నో సమస్యలు ఉన్నాయని, 90 శాతం ఉన్నవారికి సదరంలో సర్టిఫికెట్ రావడం లేదని, ఇటువంటి వాటిని సరిచేస్తామని ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తన మొదటి పర్యటన ఇదని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచి ఊరేగింపు చేసుకోవడం నాకు ఇష్టం లేదు. పనిలోకి వెళ్లాలనుకున్నా. పింఛన్లు అందించి కృతజ్ఞతలు చెబుదామని భావించానని చెప్పారు. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల కోసం తక్కువ మాటలు చెప్పి ఎక్కువ పనిచేయాలన్నది నా భావన అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నాం. ఇది అసలైన ఛాలెంజ్ అని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను జనవాణిలో విన్నా.. నిజంగా గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారు ఉన్నారంటే దివ్యాంగులేనని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తూ అందరిలో ఉన్న ప్రతిభ, సమర్థతను వెలికితీస్తామని తెలిపారు. అంతకుముందు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు సగిల షాన్‌మోహన్,ఎస్పీ సతీష్‌కుమార్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, బుర్రా కృష్ణంరాజు పాల్గొన్నారు.


వెల్‌కమ్ సార్ : డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి


వీళ్ల భవిష్యత్ చూస్తున్నా: గొల్లప్రోలు సభలో పవన్

ప్రజలకు ఆంక్షలు పెట్టవద్దు...

ప్రజల దగ్గరకు వచ్చినప్పుడు దయచేసి రక్షణ పేరుతో ఆంక్షలు పెట్టవద్దని.. గతంలో జనవాణి, ఇతర సందర్భాల్లో ప్రజలను ఎలా కలుసుకునే వాడినో అలా గే కలుసుకోనివ్వాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పోలీసు యంత్రాంగానికి సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం అని నేనెప్పుడూ అనుకోలేదు. కష్టపడే వ్యక్తిగా ఈ స్థానంలో ఈ రోజున కూర్చున్నాను. మీరు వేసి ప్రతి ఓటు సరైన వ్యక్తికి, కూటమికి వేశామని గర్వపడే విధంగా తన పనితీరు ఉంటుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. చక్రి అనే బాలుడిని వేదిక మీదకు పిలిపించుకుని ఇటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం పనిచేస్తానని చెప్పారు. నా బిడ్డలు కోసం ఎంత తపన పడతానో తెలియదు కానీ ఇటువంటి బిడ్డల కోసం ఈ తరమే కాదు రానున్న రెండు తరాల కోసం పనిచేస్తానని తెలిపారు. ఇది టీడీపీ లీడ్ చేసే ప్రభుత్వం, జనసేన వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం, ప్రధాని మోదీ, బీజేపీ పెద్దలు ఆశీస్సులు ఉన్న ప్రభుత్వమని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకుంటానని పవన్ తెలిపారు.నియోజకవర్గంలో స్థలం కోసం చూస్తున్నానని.. సొంతింటిని కట్టుకుంటానని ప్రకటించారు. మీ అందరి మధ్యే ఉంటానని చెప్పారు.

ఎవరిపై ఆధారపడక్కర్లేదు
-కలెక్టర్, సగిలి షాన్‌మోహన్



పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్లు పొందేవారు ఎవరి పై ఆధారపడకుండా జీవనం సాగించేందుకు దోహదపడుతుంది. పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరుగుతోంది. 60-70శాతం కదల్లేని స్థితిలో ఉన్నవారికి ఈ పింఛన్లు ఆసరాగా నిలుస్తున్నాయి. 40శాతం వికలాంగత్వం ఉన్నవారికే దివ్యాంగ పింఛన్ వస్తోంది. నేను ఇదే శాఖలో రెండేళ్లపాటు పనిచేశాను. అప్పుడు పలు అంశాలు నా దృష్టికి వచ్చాయి. పింఛన్లు పొందేందుకు ఆరు దశల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అర్హతలు కలిగిన వారికి న్యాయం చేసేందుకుగాను వారం విడిచి వారం ప్రతి సోమవారం పిఠాపురంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తాం. 3-4నెలల్లో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ అందేలా చూస్తాం.

పవన్‌తోనే న్యాయం
మాజీ ఎమ్మెల్యే వర్మ, పిఠాపురం



పిఠాపురం/గొల్లప్రోలు,జూలై 1: ప్రశ్నించే నాయకుడు పవన్‌కల్యాణ్ ఈ రోజున ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. ఆయనతోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది. పవన్ తీసుకున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్‌ల శాఖల ద్వారా పిఠాపురం నియోజకవర్గానికి మేలు జరుగుతుంది. విద్యుత్‌బిల్లుల సాకుతో గతప్రభుత్వంలో పింఛన్లు తొలగించారు. వారికి న్యాయం చేయాలి.

వితంతువులను ఆదుకున్నారు
-కొత్తపల్లి మంగతాయారు, గోర్స, కొత్తపల్లి మండలం

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: నా భర్త పదేళ్ల క్రితం చనిపోయారు. నాకు పింఛన్ వచ్చే సమయానికి రూ.200 ఇచ్చేవారు. చంద్రబాబు వచ్చిన తర్వాత తొలుత రూ.వెయ్యికి, తర్వాత రూ.2వేలకు పెంచారు. ఇప్పుడు మళ్లీ రూ.4వేలు చేశారు. గతంలో ఏ నాయకుడు ఇలా చేయలేదు. మీరు వచ్చిన తర్వాత ఇలా చేయడం మాకు అందరికీ గర్వంగా ఉంది. అనంతరం ఆమె పవన్‌కల్యాణ్ కాళ్లకి నమస్కరించబోగా ఆయన వారిని వారించారు.



స్మార్ట్‌సిటీ మిషన్ గడువు తొమ్మిది నెలలు పొడిగింపు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహార మంత్రిత్వశాఖ స్మార్ట్‌సిటీస్ మిషన్ గడువును 2024, జూలై నుంచి 2025, మార్చి 31 వరకు పొడిగించినట్టు కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటించింది. స్మార్ట్‌సిటీ లిమిటెడ్‌తో సహా మొత్తం 100 స్మార్ట్‌సిటీల్లో కాకినాడ ఒకటి. అన్ని నగరాలు తమ లక్ష్యాలను సాధించడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగినంత సమయం ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీస్ మిషన్-2017లో ప్రారంభించారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులను పూర్తిచేయడానికి వారి ఎంపిక తేదీ నుంచి ఐదేళ్ల సమయం ఇచ్చారు. 2022తో స్మార్ట్‌సిటీ గడువు ముగియడంతో 2024, జూన్ 30 వరకు గడువు పెంచారు. జూన్ 30తో ఆ గడువు పూర్తవడంతో తిరిగి మరో 9 నెలలు 2025, మార్చి 31వరకు స్మార్ట్‌సిటీ గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు అందాయి. స్మార్ట్‌సిటీ బోర్డు అయినప్పటికీ కాకినాడలో స్మార్ట్‌సిటీ పథకం కింద అనేక పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కాగితంపై పూర్తి చేసినట్టు కనిపించినా ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. స్మార్ట్‌సిటీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కాకినాడకు మొత్తం రూ.వెయ్యికోట్లు మంజూరు కాగా అందులో ఇప్పటికే రూ.978కోట్లు మంజూరయ్యాయి. రూ.800కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.194.42కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. కేంద్ర నిధులు పూర్తిగా వచ్చేశాయి. స్మార్ట్‌సిటీలో 70 పనులు చేపట్టగా 56కిపైగా పూర్తయ్యాయి. మిగిలిన 14పనులను గడువులోపు పూర్తి చేయాలి.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎస్ఈగా సత్యనారాయణ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ(ఆర్‌డబ్ల్యూఎస్) ఎస్ఈ ఎం.శ్రీనివాస్ జూన్ 30న ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఏలూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎస్ఈగా నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరులో పూర్తిస్థాయి ఎస్ఈగా కొనసాగుతూ కాకినాడ ఎఫ్ఏసీ ఇన్‌చార్జిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో రివ్యూ ఉండడంతో జలజీవన్ మిషన్ ప్రోగ్రాంలో నిధుల కొరత ఉందని పెండింగ్ బిల్స్ అంశంపై ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నామినేటెడ్ పదవులకు వైసీపీ నేతల రాజీనామాలు

- తమనే వరించవచ్చునని అధికార కూటమి నేతల్లో సరికొత్త ఉత్సాహం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీకి చెందిన నాయకులంతా నామినేటెడ్ పదవులకు ఒక్కొక్కరుగా రాజీనామాలు చేస్తున్నారు. జిల్లాలో పలు పదవులకు చెందిన నాయకులు తమ రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు పంపిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తమ పదవులను విడిచిపెట్టారు. ఇప్పటికే చాలామందికి ఎన్నికల ముందే పదవీకాలం ముగిసింది. దీంతో వాళ్లు తిరిగి తమ నామినేటెడ్ పోస్టుకు సంబంధించిన కార్యాలయానికి వెళ్లడం మానేశారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం రావడంతో నామినేటెడ్ పోస్టులు పొందిన అందరూ తమ పదవులకు రాజీనామా చేయాలని ఒక సర్క్యులర్ విడుదల చేసింది. దీంతో అక్కడక్కడ మిగిలిన నాయకులందరూ రాజీనామా చేశారు. ఇప్పటికే ఆ పదవులపై అధికార టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కన్నేశారు. వైసీపీ నాయకుల రాజీనామాలతో కొత్తవారికి ఆ పదవులు దక్కనున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజకీయంగా అవకాశం చిక్కని అధికార పక్షం నేతలందరూ చాలావరకు ఈ నామినేటెడ్ పోస్టులతో సంతృప్తి పరచడానికి అవకాశం ఏర్పడింది. ఇప్పటికే గ్రామస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న అధికారపక్షం నాయకులంతా తమదైన శైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం
7లో

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తా: పవన్
7లో

పిఠాపురంలో జనసైనికులు, వీరమహిళతో సమావేశం

నేడు సమీక్షలతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బిజీబిజీ
7లో

పింఛన్‌దారుల ఆనందం

వృద్ధుల కష్టాలు చంద్రన్నకు తెలుసు



వృద్ధాప్యం అనుభవిస్తూ పండుటాకుల్లా జీవిస్తున్న మా కష్టాలు చంద్రన్నకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియవు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ఎవరూ పెంచనివిధంగా పింఛన్లు పెంచిన చంద్రన్నను గతంలో మోసగించాం. తప్పు తెలుకున్నాం. నాలుగు వేలకు పెంచిన పింఛనుతో ఆనందంగా జీవిస్తాం. పండుటాకులకు ఇంతకన్నా ఏంకావాలి చెప్పండి.

- సబ్బెళ్ళ సుబ్బయ్యమ్మ, లబ్ధిదారు, అనపర్తి

చేదోడు అయ్యింది..



చంద్రబాబు పెంచిన పింఛను నాకు ఎంతో చేదోడు అయ్యింది. నాకు మూడేళ్ల కిందట ప్రమాదంలో రెండు కాళ్ల దెబ్బతిని ఆపరేషన్లు అయ్యాయి. ఇప్పటికీ ఏ పనీ చేయలేకపోతున్నా. నాకు ఈ పింఛనే ఆధారం.

తుట్టా లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, బిక్కవోలు

సంతోషంగా ఉంది..



చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు పింఛను పెంచారు. ఏప్రిల్ నుంచి పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు 3 వేలు కూడా కలిపి రూ.7 వేలు పింఛను తీసుకోవడం ఆనందంగా ఉంది.

వేళంగి గౌరమ్మ, కడియం

బాబుకు కృతజ్ఞతలు



పింఛను రూ.3 వేల నుంచి నాలుగు వేలకు పెంచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. దీంతోపాటు ఏప్రిల్ నెల నుంచే పెంచిన మొత్తాన్ని కలిపి మొత్తం రూ.7 వేలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. చంద్రబాబుకు కృతజ్ఞతలు.

బత్తిన మార్తమ్మ, వడిశలేరు, రంగంపేట మండలం

చేయూత అందింది



చాలా ఆనందంగా ఉంది. నాకు కాలుకు ఇబ్బంది వచ్చి ఆపరేషన్ చేయించుకున్నా. అప్పులపాల య్యాం. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రయత్నించినా గత ప్రభుత్వంలో మాకు ఏ పని అవ్వలేదు. ఇప్పుడు పింఛను పెంచి ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం వచ్చింది. చంద్రబాబు అండగా నిలబడ్డారు..

- జొన్నాడ సూరమ్మ, సీతానగరం

- అనపర్తి/ బిక్కవోలు/కడియం/రంగంపేట/సీతానగరం

నిత్యాన్నదానానికి రూ.లక్ష



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 1: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం రామచంద్రపురానికి చెందిన కొత్తపల్లి రామకృష్ణ, వరలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు



మోతుగూడెం, జూలై 1: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు పరిధిలోని మూడు జల విద్యుత్ కేంద్రాల ఇంజనీర్లు నూతన సీఈ వాసుదేవరావుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జెన్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు సీఈని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంజనీర్లతో సమావేశమై కాంప్లెక్సు పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి, యూనిట్ల పనితీరుపై నీటి నిల్వలు తదితర అంశాలపై చర్చించారు.

ఐటీఐలో ప్రవేశానికి ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో, జగ్గంపేటలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి ఈనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు.

4న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 1: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 4న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంజీవీ వర్మ తెలిపారు. ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు 350 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



సత్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నగిరి ఈవో, చైర్మన్

పోలీసుల గౌరవ వందనం

పూల కార్పెట్‌పై నడిచేందుకు పవన్ నిరాకరణ

అభినందనలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కాకినాడ జిల్లాకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సోమవారం ఘనస్వాగతం లభించింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో గల తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పవన్‌కు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తదితరులు స్వాగతం పలికారు. అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్‌లు పవన్‌ను శేషవస్త్రాలతో సత్కరించి సత్యదేవుని ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. పవన్ వస్తున్నారనే సమాచారం తెలియడంతో భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. కాగా పవన్ తన నివాసంలోకి వెళ్లే దారిలో గులాబి పువ్వులను కార్పెట్‌లా పరిచారు. దానిపై నడిచేందుకు పవన్ సున్నితంగా తిరస్కరించి పక్క నుంచి నడిచి నివాసంలోకి వెళ్లారు. చేబ్రోలు నివాసం వద్ద పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన తనయుడు గిరీష్ పవన్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వర్మను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాలు నుంచి తరలివచ్చే ప్రజలు ఇచ్చే వినతులను స్వీకరించేందుకు చేబ్రోలు నివాసం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. జనవాణి పేరుతో వినతులు స్వీకరించి వారి సమస్యలను కౌంటర్‌లోని సిబ్బంది అడిగి తెలుసుకుంటున్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం



పవన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ జగదీశ్ తదితరులు

కోరుకొండ, జూలై1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన సందర్భంలో ఆయనకు విమానాశ్రయం వద్ద మంత్రి దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యేలు ఘనంగా స్వాగతం పలికారు. తూర్పుగోదావరి జిల్లా కొత్త కలెక్టర్ పి.ప్రశాంతి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి కూడా పవన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పిఠాపురం బయల్దేరి వెళ్లారు.



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తా

మీరిచ్చిన బలం రాష్ట్రమంతా తిరిగేలా చేసింది

జనసైనికులు, వీరమహిళల సమావేశంలో జనసేనాని పవన్‌కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు, జూలై 1: ఆఖరి శ్వాస వరకూ ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం సాయంత్రం జరిగిన పిఠాపురం నియోజకవర్గ జనసైనికులు, వీరమహిళల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. సుమారు గంటన్నర పాటు వారితో మాట్లాడారు. పీఠికాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడదామన్నారు. పిఠాపురంలో మీరిచ్చిన బలం రాష్ట్రం అంతా తిరిగేలా చేసిందని చెప్పారు. తనకు పదవులపై వ్యామోహం లేదన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో పిఠాపురం తనను గెలిపిస్తుందా లేదా, అన్ని స్థానాలు గెలుస్తామా లేదా అని ఆలోచన ఉండేది కాని మనస్సులో మాత్రం మనం ఘన విజయం సాధించబోతున్నామని ధీమా ఉందని అన్నారు. అందుకే టీవీలు చూడలేదు. గెలుపు తర్వాత వచ్చి చెవిలో చెప్పమన్నా అని వివరించారు. గెలిచిన తర్వాత నియోజకవర్గానికి వచ్చేద్దాం. తిరిగేద్దాం. గజమాలలు వేయించుకుందామనే ఉబలాటం కలిగిందని, అయితే మనస్సు మాత్రం ఇంత ఘనమైన విజయం అందించిన వారి కోసం ఒక కూలీలా కష్టపడి పనిచేసి గతంలో ఎవ్వరు చేయని విధంగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసి చూపించాలని సూచించిందని తెలిపారు. పిఠాపురానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చి ప్రపంచదేశాలన్ని ఇటువైపు చూసేలా చేస్తానని చెప్పారు. పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తన శాఖలపై ప్రజలు నుంచి అభిప్రాయాలు కోరితే ఒక్క పిఠాపురం నియోజకవర్గం నుంచే 1424 ఇన్‌పుట్స్ వచ్చాయని చెప్పారు. ఇందులో దుర్గాడ, ఉప్పాడ తదితర గ్రామాలు నుంచి విలువైన సూచనలు వచ్చాయని తెలిపారు. తన కోసం, జనసేన విజయం కోసం దేశ, విదేశాలు నుంచి జనసైనికులు, వీరమహిళలు వచ్చి పనిచేశారని, ఒకరైతే ప్రాణాలు కోల్పోయారని పవన్ తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి ఒకరు వచ్చి ఆరునెలలు ఇక్కడ పనిచేశారని, బజ్జీలు అమ్ముకనే వ్యక్తి తన సంపాదనలో కొంతభాగాన్ని జనసేనకు విరాళం ఇచ్చారని, ఎండలో మలమల మాడుతూ ప్రచారం నిర్వహించారని, ఇవన్ని గుర్తుకు వస్తుంటే కన్నీళ్లు తిరుగుతున్నాయని, ఏమిచ్చి వీరి రుణం తీర్చుకోగలనని ఆయన అన్నారు.

పిఠాపురాన్ని వదిలి ఎక్కడకీ వెళ్లను

పిఠాపురాన్ని వదలి తాను ఎక్కడకు వెళ్లను అని పవన్ స్పష్టం చేశారు. పిఠాపురంలోనే స్థలం తీసుకుని ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. మతాల సామరస్యతకు పిఠాపురం ఒక చిహ్నమని చెప్పారు. ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి, సాయంత్రం జరిగిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళల సమావేశానికి తరలివచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించిన గొల్లప్రోలు జనసేన సేవా సమితి ప్రతినిధులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. సుమారు 10వేల మందికి భోజనాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమీక్షలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిజీబిజీ

టూర్ షెడ్యూల్ విడుదల

గొల్లప్రోలు రూరల్, జూలై 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జరిపే టూర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. 2వ తేదీ ఉదయం 9.30 గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరుతారు. కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలు నుంచి 11గంటల వరకూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30 నుంచి 12 గంటల వరకూ రోడ్ కనెక్టివిటీపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ రీజనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో నూతనంగా రీజనల్ సైన్స్ సెంటర్ ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు. రాత్రికి చేబ్రోలులోనే బసచేస్తారు.

కేన్సర్ స్ర్కీనింగ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలి

ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

రాజానగరం/రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 1: కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షను ఆరోగ్యశ్రీలో చేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని న్యూయార్క్‌లో కేన్సర్ అధ్యయన కేంద్రాన్ని నిర్వహిస్తున్న ప్రముఖ రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు కోరారు. డాక్టర్స్ డే సందర్భంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిని, రాజమహేంద్రవరంలోని కేన్సర్ ఆసుపత్రిని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నెలకొల్పిన అంతర్జాతీయ ఫుడ్ సర్వీసుల సంస్థ సొడెక్సో శాఖాహార భోజన పథకాన్ని, కొత్తగా నెలకొల్పిన, అప్ గ్రేడ్ చేసిన మూడు కేన్సర్ చికిత్స యూనిట్లను డాక్టర్ నోరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ నిర్మూలన అంటే జబ్బు వచ్చాక తగ్గించుకోవడం మాత్రమే కాదని ప్రజలు కేన్సర్‌పై అవగాహన పెంచుకోవడం, ఎప్పటికప్పుడు స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవమే కేన్సర్ నిర్మూలనని చెప్పారు. కేన్సర్‌ను సకాలంలో గుర్తించి ఎప్పటికప్పుడు ట్రీట్మెంట్ తీసుకుంటే 98 శాతం కేసుల్లో ప్రాణాపాయం నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ జీఎస్ఎల్ గ్రూపు సంస్థలు సబ్సిడీ పథకాన్ని ప్రారంభిస్తూ, జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు రూ.10కే భోజనం అందిస్తామన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా రెండు దశాబ్దాలుగా జీఎస్ఎల్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 100 మంది వైద్యులు, ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బందిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పీబీ ఆనందరావు, సీఎస్ఎల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గన్ని కృష్ణ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై 57 అర్జీలు

రంపచోడవరం జూలై 1: ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం అధికారులు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 అర్జీలు రాగా కొన్ని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత శాఖలకు పంపించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తాళ్లరేవు, జూలై 1: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి ఇందిరమ్మకాలనీకు చెందిన పిల్లి వినయ్(20) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కోరింగ ఎస్ఐ రవికుమార్ సోమవారం తెలిపారు. ఇందిరమ్మకాలనీలో వినయ్ చిన్నాన్న ఇంటి నిర్మాణంలో భాగంగా వాటర్ డ్రమ్‌ను నింపేందుకు విద్యుత్ మోటారును సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తూ పిల్లి వినయ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన వినయ్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లగా చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మన్యం ప్రాంతంలోని పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

మెగా డీఎస్సీతో స్థానిక అభ్యర్థులకు అన్యాయం

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేత మురళి

చింతూరు, జూలై 1: మన్యం ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు గాను స్థానిక అభ్యర్థులకు మాత్రమే వర్తించే విధంగా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో మన్యం పోస్టుల భర్తీని కూడా కలిపేయడం వల్ల స్థానిక డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. నాయకులు పులి వీరయ్య, పైదా ముత్తయ్య, తుర్రం రమేష్, సోడె సత్యనారాయణ పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు..

రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, జూలై 1: గత ఐదేళ్లలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, పోలవరం ప్రాజెక్టు నాశనం చేయడంతో పాటు అమరావతిని కూడా రూపురేఖలు మార్చి వేశారని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. పింఛన్ల పంపిణీ నిమిత్తం పెరవలి మండలం తీపర్రు వచ్చిన ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాను జగన్ ప్రభుత్వం ఖాళీ చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే కష్టతరంగా మారిందన్నారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కడియం నర్సరీలను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం, వివిధ ఆలయాలను అభివృద్ధి చేయడం ద్వారా టెంపుల్ టూరిజం, ప్రకృతి ప్రదేశాలు అభివృద్ధి చేయడం ద్వారా హెరిటేజ్ టూరిజం అభివృద్ధి చేస్తామని దుర్గేష్ పేర్కొన్నారు. విశాఖపట్టణం, తిరుపతి పరిసర ప్రాంతాల్లో టూరిజం బాగా అభివృద్ధి చెందుతోందని, రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేసి పిచ్చుకలలంక పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేశారని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులను టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సమన్వయంతో ఎంపిక చేసి ఆ పోస్టుల్లో నియమిస్తామని, దానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అతికాల శ్రీను, పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, మొగళ్ళపు సీతారాం, ప్రత్తిపాటి వీరభద్రకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

యానాం, జూలై 1: స్థానిక సీగల్స్‌లో సోమవారం యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాలలో 1978-81లో పది, ఇంటర్ చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పూర్వ విద్యార్థులు అనిమిల్లి సత్యనారాయణ, వేమూరి విజయ్‌కుమార్, దంగేటి త్రిమూర్తులు, గొకవరపు వీరేశ్వరరావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. యానాం పబ్లిక్ స్కూల్‌లో పేద విద్యార్థిని ఎస్.అమృతవర్షిణికి రూ.10వేలు ఫీజులు కోసం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొత్తరమూడి వెంకటేశ్వరరావు (విశ్రాంతి ఎస్పీ సీఐఎఫ్ఎస్), గూటం శివగణేష్ (విశ్రాంతి సీఐ), పోలిమారి సత్యనారాయణ(విశ్రాంతి మేనేజర్ ఇండియన్ బ్యాంక్), కమిడి విజయ్‌కుమార్, కముజు సూరిబాబు(ప్రముఖ న్యాయవాది) పాల్గొన్నారు.

రోడ్‌కంరైలు బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



కొవ్వూరు, జూలై 1: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి 11 గంటల మధ్యలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు టోల్ గేట్ వద్ద గడ్డర్ల సమీపంలో ఏలూరు డిపో బస్సు మొరాయించింది. అదే సమయంలో కొవ్వూరు వైపు బ్రిడ్జిపై మలుపులో మరో బస్సు మొరాయించి నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మొరాయించిన బస్సులను ప్రయాణికులు పక్కకు నెట్టారు.



బస్సును తోస్తున్న ప్రయాణికులు

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



కోటనందూరు, జూలై 1: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేతఃఈ చిన్నయ్యపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం...అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వీకే గూడెం గ్రామానికి చెందిన కొమ్ము సూర్యనారాయణ (45) రౌతులపూడి మండలం రాజవరం నుంచి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా మరో మోటార్ బైక్‌పై కోటనందూరు మండలం అల్లిపూడి నుంచి కేతః చిన్నయ్యపాలెం వైపు వెళుతున్న మోటార్‌బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటార్ బైక్‌పై ఉన్న నేలపాటి అప్పలకొండ, మార్తి రాజుకు గాయాలు కావడంతో 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

'24గంటలు అందుబాటులో టోల్‌ఫ్రీ'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 1: తాగునీటి సంబంధ సమస్యలు, వీధిదీపాలు, పారిశుధ్యం, డయేరియా తదితర సీజనల్ వ్యాధుల పరిష్కారానికి నిరంతరాయంగా 24గంటలు పనిచేసేలా టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్టు కమిషనర్ వెంకటరావు తెలిపారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత విభాగాల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టోల్‌ఫ్రీ 1800 4255990కు ఫోన్ చేసి సమస్యలు చెప్పవచ్చన్నారు.

పెంచిన పింఛన్ల పంపిణీ

» లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు

» సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు

» సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం



తాళ్లరేవు: పి.మల్లవరంలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల



ప్రత్తిపాడు: పెద్దిపాలెంలో స్వీటుప్యాకెట్లు పంచుతున్న టీడీపీ నాయకులు



కరప: యండమూరులో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి సమక్షంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కాకినాలో సీఎం చంద్రబాబు కటౌట్‌కు పాలాభిషేకం చేసి హారతులిస్తున్న మహిళలు

కాకినాడ సిటీ, జూలై 1: పేదల జీవితాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్ సొమ్ము పెంచాలనే నిర్ణయం తీసుకున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక 6వ డివిజన్ కొత్త కాకినాడ సచివాలయం ప్రాంతం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో రూ.3వేలు ఉండే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచడంతో పాటు పెరిగిన పెన్షన్ గడచిన మూడు నెలల వ్యత్యాసం కలిపి రూ.7 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంపుదల చేశామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 30,552 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్లు సజావుగా పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, హెల్త్‌ఆఫీసర్ పృధ్వీచరణ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వనమాడి సూచనల మేరకు నగరంలోని పలు డివిజన్లలో టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. 28వ డివిజన్‌లో మాజీ మేయర్ సుంకర పావని కూటమి నాయకులతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు. 41వ డివిజన్‌లో టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్లు, పండ్లు పంపిణీ చేశారు. 36వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పెన్షన్లు పంపిణీ చేశారు. 39వ డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, 12వ డివిజన్‌లో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, 13వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ వొమ్మి బాలాజీ పెన్షన్లు పంపిణీ చేశారు. 10వ డివిజన్ దుమ్ములపేటలో టీడీపీ నాయకులు చోడిపల్లి సతీష్, మూగు రాజు, 11వ డివిజనలో టీడీపీ నాయకులు కశింకోట చంద్రశేఖర్, కడలి వెంకటరమణ, 25వ డివిజన్‌లో ఇన్‌చార్జి మేడిశెట్టి చిన్ని పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయా డివిజన్ల నాయకులు జొన్నాడ వెంకటరమణ, వాసిరెడ్డి కుమార్, నల్లూరి తులసి, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, సుంకర సురేష్, చీకట్ల వాసు, ఆకెళ్ల ప్రసాద్ పాల్గొన్నారు. పెద్దమార్కెట్ ఏరియాలోని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, మహిళలు చంద్రబాబు కటౌట్‌కు పాలాభిషేకం చేసి హారతులిచ్చారు. స్వీట్లు పంపిణీ చేసి పేదలకు భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాంవర్మ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పులి పద్మకుమారి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పు మురళీకృష్ణ, రూరల్ అధ్యక్షుడు మండపాక నాగబాబు, సిటీఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: వృద్ధాప్యం భారం కాకూడదనే ఉద్దేశ్యంతో రూ.3 వేలుండే పింఛన్ సొమ్మును రూ.4 వేలుకు పెంచి వృద్ధులకు సామాజిక ఆర్థిక భద్రతను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్పించారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. నేమాం, పండూరు, తిమ్మాపురంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. మండలంలో వలసపాకల, వాకలపూడి, పెనుమర్తి, తిమ్మాపురం, రమణయ్యపేట, గైగోలుపాడు, స్వామినగర్, ఇంద్ర పాలెం, చీడిగ, తూరంగి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి పింఛన్లు అందించారు. సూర్యారావుపేటలో కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), రమణయ్యపేటలో మాజీ కార్పొరేటర్ పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసులు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు, సెక్రటరీలు జొన్నాడ నరసింహరావు, కేసవ్, పాండు రంగారావు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: పెంచిన పింఛన్లను టీడీపీ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రేపూరు, కొవ్వాడ తదితర గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేశారు.

కరప: మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు యండమూరు, నడకుదురు, వలసపాకల, జి.బావారం, వడ్డిపాలెం, కొంగోడు, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, గురజనాపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. యండమూరులో సీఎం చంద్రబాబు చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. నడకుదురులో సీఎం, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. నడకుదురులో సర్పంచ్ దేగల లలితకుమారి, టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి, మాజీ ఎంపీపీలు గుల్లిపల్లి శ్రీనివాసరావు, యాసలపు దుర్గాప్రసాద్...కరపలో టీడీపీ నేత నులుకుర్తి వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు. పెనుగుదురులో జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, నాయకులు రెడ్డిపల్లి బాస్కర్, మాచరరావు పింఛన్లు పంచారు.

సామర్లకోట: సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానంలో భాగంగా పెంచిన పింఛన్ సొమ్ములను ఇంటింటికీ అందజేయ డంతో ప్రతీ కుటుంబాల్లో పండుగ వాతావరణం ఏర్ప డిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలో అచ్చంపేట పంచాయతీ వద్ద నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేసారు. ఉండూరు పంచాయతీ వద్ద కూడా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు సలాది బ్రహ్మానందరావు, వీరంరెడ్డి పెదబాబు, వీరంరెడ్డి చిన బాబు, వింటి బాబ్జీ, అడ్డాల వెంకన్నబాబు, ధనలక్ష్మి, కొప్పిరెడ్డి రాజా, దివానం, కొప్పిరెడ్డి వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ పాల్గొన్నారు. సామర్లకోట 5వ వార్డు కోలావారి వీధి నందు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

తాళ్లరేవు: ఎన్నికల హామీలో పింఛన్లను పెంపుచేస్తామని ప్రజలకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మండలంలోని పి.మల్లవరం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుచ్చిబాబు పూజలు చేసి పింఛన్ల పంపిణీ ప్రారంబించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్‌బాబు, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి అనంతలక్ష్మి, పెన్నాడ వేణి, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, పితాని హేమలత, జనసేన నేతలు అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్ పాల్గొన్నారు. పింఛన్ల పెంపు సందర్భంగా మండలం గ్రామాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు కూటమి నేతలు పాలాభిషేకాలు నిర్వహించారు. తాళ్లరేవు గాంధీనగర్ వద్ద ఎమ్మెల్యే దాట్ల పాలాభిషేకం చేశారు.

తుని రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ప్రభుత్వం పెంచిన పింఛన్ల తుని, మండలంలోని వి.కొత్తూరులో స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేపట్టారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, కుసుమంచి సత్యనారాయణ, సిద్దాంతపు సత్తిబాబు, జల్లువాసు, అల్లు రాజు, సుర్ల లోవరాజు, టీడీపీ కార్యకర్తలు తమరాడ సత్యనారాయణ, రొంగల అబ్బుకిల్లు శ్రీను, బోజంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: పాతకొట్టాంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, సుంకరపావని, యనమల రాజేష్, షేక్‌నవాబ్‌జానీ, సుర్ల లోవరాజు, అంకంరెడ్డి రమేష్, చిటికెల సత్యనారాయణ, పోతల సూరిబాబు, వెలగా వెంకట కృష్ణారావు, పెనుముచ్చు నాగేశ్వరరావు, యర్ర చిన సత్యనారాయణ, మాతిరెడ్డి భాస్కర్‌రావు, షేక్ బాబ్జి, బైలపూడి శ్రీరామమూర్తి,బంటుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మండలానికి మెదటిసారిగా వచ్చిన యనమల దివ్యను కెఎ.మల్లవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికారిత ఉపాధ్యక్షురాలు గాడి శైలజ రాజుబాబు మహిళలు ఆధ్వర్యంలో సత్కరించారు. గెడ్డం అచ్చిరాజు, ఇరటం అప్పలనర్స, కాపారపు శాంతమ్మ, పారుపల్లి ఉమ సింగంపల్లి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండల పరిషత్ కార్యాలయంలో తుని ఎమ్మెల్యే యనమల దివ్య పింఛన్లు పంపిణీ చేశారు. యనమల రాజేష్, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడ వెంకటరమణ, చింతంనీడి అబ్బాయి,సోమాల ప్రసాద్, నేమాల కృష్ణ, నర్సింహమూర్తి పాల్గొన్నారు. ఏవినగరంలో యనమల నాగేశ్వర్రావు పంపిణీ చేశారు.

జగ్గంపేట: ఇచ్చిన మాట ప్రకారం ఫించన్లు పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల కళ్లల్లో ఆనందం నింపిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్ల కార్యక్రమం ప్రారంభం సందర్భంగా జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పలు సచివాలయకు వెళ్లి ఇంటింటికి పింఛన్లు అందజేశారు. ఇర్రిపాక, కిర్లంపూడి మండలం సోమవరం, జగపతినగరంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, సర్పంచ్ బచ్చల నాగరత్నం, సుదీర్, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు పాల్గొన్నారు. జగ్గంపేట మండలం మామిడాడ గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ నిర్వహించగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతులమణి హాజరై ఫించన్లు అందజేశారు. జగ్గంపేట పంచాయతీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి, కుమారుడు అనీష్ నెహ్రూలు పింఛన్ల పంపిణీ చేశారు.

గండేపల్లి: తాళ్ళూరు, మల్లేపల్లి, గండేపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, దొమ్మా శ్రీను, పరిమిబాబు, శీలామంతుల వీరబాబు, పైణ్ణి వెంకటేశ్వరరావు, తెలగరెడ్డి భద్రరావు, వెలమాటి కాశీ, తెలగరెడ్డి ప్రకాశరావు, వల్లభశెట్టి కోటేశ్వరరావు, పిల్లా సత్తిబాబు, దార్లంక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని సోమవరం, కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. బూరుగుపూడిలో ఎమ్మెల్యే నెహ్రూ కుమార్తె తోట సునీత, సర్వారాయుడు, కుంచే తాతాజీ, పాటంశెట్టి రవి, ఉపసర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి పింఛన్లు అందజేశారు.

ప్రత్తిపాడు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల వంటి ఫించన్‌దారుల్లో చిరునవ్వులు, సంతోషం చూడాలని సీఎం చంద్రబాబు ఫించన్ పెంపుదల చేపట్టారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పెదశంకర్లపూడి, శరభవరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండుగ వాతావరణంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సర్పంచ్‌లు సుర్నీడి నాగరత్నం, అమరాది వెంకట్రావు, వరుపుల రామకృష్ణ, జువ్విన తిరుపతిరావు, దో నవీన్, పాల్గొన్నారు. ధర్మవరంలో టీడీపీ నాయకులు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, జనసేన, బీజేపీ నాయకులు దాసం శేషారావు, ఊటా వీరబాబు ఫించన్లు పంచారు. పెద్దిపాలెంలో టీడీపీ నాయకుడు రెడ్డి అమర్నాథ్ చౌదరి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, టీడీపీ నాయకులు రీసు సత్తిబాబు, లొండా వెంకటేష్, కుండల అప్పా రావు, గైహరి శ్రీను పింఛదారులకు ఫించనుతో పాటు స్వీట్లు ప్యాకెట్లు అందజేశారు. ధర్మవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఏలేశ్వరం: పట్టణంలో 18వవార్డు పరిధిలో, లింగంపర్తిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పింఛన్లు పింఛన్లు అందజేశారు. ప్రత్తిపాడు జనసేన ఇనచార్జి వరుపుల తమ్మయ్యబాబు, నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ పెంటకోట మోహన్, పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య యండగుండి నాగబాబు, బూర్లు సత్తిబాబు, వైబోగుల సుబ్బారావు, మామిడి లలిత, జిగటాపు సూరిబాబు, బెల్లాని శ్రీను, పాండ్రంకి అప్పారావు, పెంటకోట శ్రీధర్, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

రౌతులపూడి: పి.చామవరంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సర్పంచ్ నందమూరిరాజాతో కలిసి పింఛన్లు అందజేశారు. మండల గ్రామాల్లో కూటమి నాయకులు స్వీటుబాక్సులతో పింఛన్లు అందజేశారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరరావు, సింహాద్రి పెదబాబు, జేట్లా రాజా, శీరంరెడ్డి శ్రీను, శీరంరెడ్డి లోవరాజు, బంగారు స్వామినాయుడు, గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు పాల్గొన్నారు.

శంఖవరం: శంఖవరంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు(శివ), తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్, బద్ది రామారావు, జనసేన నేతలు మేకల కృష్ణ, తలపంటి బుజ్జి, గాబు సుభాష్, కీర్తి కుమార్, బుర్రా వాసు, బది రామకృష్ణ తదితరులున్నారు.

పిఠాపురం: పిఠాపురంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాయాల సిబ్బందితో కలిసి టీడీపీ, జనసేన నేతలు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పలుచోట్ల స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు లబ్ధిదారులకు రాసిన లేఖలను అందజేశారు.

అన్నవరం: గ్రామంలో టీడీపీ శ్రేణులు పింఛన్ల పంపిణీ నిర్వహించారు. సోమవారం 90శాతం పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. టీడీపీ శ్రేణులు కడుపుకుట్ల కృష్ణ, అల్లు సత్తిబాబు, పల్లా గోవింద్, సప్పా సత్తిబాబు, పంచదార్ల సత్యనారాయణ, రాజాల చిట్టిబాబు, బొమ్మిడి సత్తిబాబు,నంబారు కృష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని 18 గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : మంత్రి సుభాష్



గొల్లపాలెంలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి

కాజులూరు, జూలై 1: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. మండలంలోని గొల్లపాలెంలో సోమవారం సాయంత్రం మంత్రి సుడిగాలి పర్యటనచేశారు. గొల్లపాలెం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను తనిఖీచేశారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నా యా అని ఆరా తశారు. ఆసుపత్రి చుట్టూ పారిశుధ్యం పేరుకుపోవడంతో అసహనం వ్యక్తం చేసి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక హైస్కూల్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై పలువురు విద్యార్థులు మంత్రి ఎదుట అసంతృప్తి వ్యక్తం చేయడంతో సిబ్బందిని హెచ్చరించారు. గొల్లపాలెం-కొంగోడు రహదారిలో ఇళ్ల స్థలాల్లోకి వెళ్లే దారి వివాదాస్పదంగా ఉందని పట్టాదారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా స్థలాన్ని ఆయన పరిశీలించి విచారణ చేపట్టి సమస్య పరిష్కరించాలని రెవెన్యూ, పోలీస్ శాఖలను ఆదేశించారు. టీడీపీ బీసీసెల్ నాయకుడు మేడిశెట్టి శేషారావు, జనసేన, టీడీపీ నాయకులు దేగల సతీష్, తోట కృష్ణ, అంగర కృష్ణ, అంగర చిన్నాగౌడ్, ధరణి తదితరులున్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



తుని రూరల్: తేటగుంట పీహెచ్‌సీ వైద్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై 1: వైద్యులు దేవుళ్లతో సమానమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. డాక్టర్స్‌డే పురస్కరించుకుని తేటగుంట పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ పి.సాహితి, డాక్టర్ జి.నీరజలకు ఆమె దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం పీహెచ్‌సీ నిర్వహించిన డయేరియా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి) మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, కార్యకర్తలు గజ్జి రాంబాబు, పేరూరి వెంకట కృష్ణ, పప్పు నవీన్, చిరంజీవిరాజు, చామంతి సత్తిబాబు, జనసేన నాయకులు మర్రి వీరబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్స్ డేను నిర్వహించారు. డాక్టర్ టి.ప్రణీత్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ తేజ, డాక్టర్ సంధ్య, సుగంధి, భాష, బాబ్జి, సత్యనారాయణ పాల్గొన్నారు. జగ్గంపేటలోని జయ నర్సింగ్ హోం అధినేత రమేష్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సత్కరించారు.

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెంట్ జి.ఎస్.ఎస్.కె. శైలజ, వైద్యులు రమేష్, రఘుపతి, లావణ్య, ఇతిహాస్, స్రవంతి, సౌమ్య హారికలను శాలువా కప్పి, మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో అలమండ దుర్గా వెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కందుల ప్రభాకర్ చౌదరి, పూర రాజబాబు, లయన్స్ ప్రతినిధులున్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లను సత్కరించారు. పి.మల్లవరం, తాళ్లరేవులో ఆర్ఎంపీ డాక్టర్లును లయన్స్‌క్లబ్ సభ్యులు సత్కరించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైద్యాధికారులను, సిబ్బంది శాలువాలు కప్పి బొకేలు అందజేసి సన్మానించారు. ఆసుపత్రి సిబ్బంది, స్థానికులున్నారు.

'సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, జూలై 1: వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కానిస్టేబుల్స్ 2022 నియామక ప్రక్రియ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్స్ ప్రిలిమ్స్ క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎమ్మెల్యే పంతం నానాజీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంలో కానిస్టేబుల్స్ ప్రిలిమ్స్ క్వాలిఫైడ్ అభ్యర్థులు నానాజీని కలుసుకుని వినతి పత్రం అందించారు. కానిస్టేబుల్స్ నియామక సమస్యను డిప్యూటీ సీఎం ద్వారా, సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే నానాజీ హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

శంఖవరం, జూలై 1: పాఠ్యాంశాలను సులభ పద్ధతుల్లో విద్యార్థులకు వివరించేందుకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం కత్తిపూడిలో నిర్వహించగా పెద్దాపురం డివిజన్‌లో 9పాఠశాల ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు చక్కగా వివరించాలని, శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ప్రతీఉపాధ్యాయుడు ఉత్తీర్ణత సాధించాలని లేకపోతే మళ్లీ శిక్షణకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్వీ రమణ, ఆకెళ్ళ శ్రీనివాస్ తదితరులున్నారు.

విజయజనార్థనాచార్యులకు ఎక్స్‌లెన్స్ అవార్డు

పిఠాపురం, జూలై 1: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో అర్చకుడిగా ఉన్న విజయజనార్ధనాచార్యులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. పదేళ్లుగా ఆలయాభివృద్ధి, ధార్మిక సేవ, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వ్యవహరిస్తున్న ఆయనకు అవార్డు ప్రకటించారు. రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు కార్యాలయంలో సోమవారం కమాండెంట్ డాక్టర్ కె.నరసింహరావు అవార్డును విజయజనార్ధనాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి, రాయుడు చంద్రకుమార్, పెద్దింటి రామం, విజయకుమార్ పాల్గొన్నారు.

వినోద్‌కు తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డు

సర్పవరం జంక్షన్, జూన్ 1: నిరుద్యోగ యువతకు ఐటీ,సాఫ్ట్‌వేర్ పోటీ పరీక్షల్లో అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డును రమణయ్యపేట ఏపీఎస్పీకి చెందిన వీజేఎస్ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో రేయల్టన్‌లో నిర్వహించిన తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డును టాలీవుడ్ హీరోయిన్ భూమికా చావ్లా చేతులమీదుగా అందుకున్నట్టు వినోద్ తెలిపారు. వినోద్‌ను డాక్టర్ వంశీకృష్ణంరాజు, డాక్టర్ పీ.సత్యనారాయణ, స్టేట్ ఎస్సీమాల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జంగా గగారిన్ అభినందించారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఏలేశ్వరం, జూలై 1: తెలగాకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, విశ్రాంతి ఉపాధ్యాయులు ఉద్దగిరి సోమరాజు జన్మదినాన్ని పట్టణంలో స్వామీ దయానంద సరస్వతీ ఆశ్రమంలో నిర్వహించారు. సోమరాజు ఆశ్రమంలో 30మంది పేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, పలకలు, పెన్నులు, బిస్కెట్లు, ఫ్రూటీలు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి సోమరాజును సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏ.సత్యనారాయణ, సఖిరెడ్డి ప్రభ, కటకం కిరీటి, గట్టెం వెంకట రమణ, గోళ్ల నాగేశ్వరరావు, రెడ్డి లోవరాజు, కరణం నాని, పి.రమేష్, గట్టెం సీతారాం, కర్రి శ్రీహరి, ఉడతల రమణారావు ఉన్నారు.

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన విరీష

సర్పవరం జంక్షన్, జూలై 1: కాకినాడ రూరల్ ఎంపీపీగా తిమ్మాపురం ఎంపీటీసీ-1 సభ్యురాలు బిందిలి విరీష రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీపీగా కొనసాగిన ఎంపీపీ గోపిశెట్టి పద్మజ వ్యక్తిగత కారణాలతో ఈనెల 29న తన పదవికి రాజీనామా చేసిన సంగతి విదితమే. విరీష మాట్లాడుతూ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఎంపీటీసీలతో కలసి మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పుల్ల కోటేశ్వరరావు, గీసాల శ్రీనివాసరావు, ముద్దన వెంకట్రాజు, పలువురు సర్పంచ్‌లు ఉన్నారు.

పారిశ్రామికవేత్త గోలి ధర్మరాజు మృతి

సామర్లకోట, జూలై 1: అప్ ల్యాండ్ ఏరియా రైస్‌మిల్లర్స్ ప్రతినిధి, వేట్లపాలెం ఆదిలక్ష్మీ ఇండస్ట్రీస్ భాగస్వామి గోలి ధర్మరాజు(73) అస్వస్థతతో కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందారు. వేట్లపాలెంలో రైస్ మిల్లు నిర్వహణలోనే గాక కరపెండలం దుంపల ఆధారంగా సగ్గుబియ్యం తయారు చేసే శాగో పరిశ్రమను సైతం నెలకొల్పి ఈ ప్రాంతంలో తన పరిశ్రమల ద్వారా ఎందరికో ఉపాధి కల్పించిన పారిశ్రామికవేత్తగా ధర్మరాజు పేరొందారు. పారిశ్రామికవేత్తలు గుమ్మళ్ళ సత్యనారాయణ, గుమ్మళ్ళ రాయన్న, నెక్కంటి సత్యన్నారాయణ, తిలక్, మాజీ జడ్పీటీసీ గుమ్మళ్ళ విజయలక్ష్మీరామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

పవన్ నివాసం వద్ద 104 ఉద్యోగుల ఆందోళన

గొల్లప్రోలు రూరల్, జూలై 1: చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద 104 ఉద్యోగులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉద్యోగులు వచ్చారు. పవన్ అప్పటికే నివాసంలోకి వెళ్లిపోయారు. తాము పవన్‌ను కలిసే వరకూ వెళ్లబోమని చెప్పి వారు నివాసం వద్దే ఉండి పోయారు. గొల్లప్రోలు అడిషనల్ ఎస్ఐ నరసింహరావు వారితో చర్చించారు. మంగళవారం పవన్‌ను కలిసి వినతిపత్రం అందించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు.



జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ, పక్కన ఎమ్మెల్యే రాజప్ప

'రైస్ మిల్లర్లకు ఇబ్బందులు ఉండవు'

కాకినాడ సిటీ, జూలై 1: గత వైసీపీ ప్రభుత్వ హయంలో రైస్ మిల్లర్లు అనేక ఇబ్బందులు పడ్డారని, అటువంటి ఇబ్బందులు టీడీపీ ప్రభుత్వంలో ఉండవని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాకినాడలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నున్న రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిధిగా హాజరైన రాజప్ప మాట్లాడుతూ రైతులకు, మిల్లర్లకు ప్రభుత్వం వారధిగా ఉంటూ వారి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం మిల్లర్ల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. రైతు బాగుకోసం టీడీపీ అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రెండో పంట మధ్యలో ఉందని, బొండాలు రకం బస్తా రూ.1500 నుంచి రూ.1700కు కొనుగోలు చేసేందుకు నిర్ణయించామన్నారు. జిల్లాలో మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రామకృష్ణను పలువురు రైస్ మిల్లర్లు శాలువాలు, దండలతో సత్కరించారు. అసోసియేషన్ భవనం ఆవరణలో రాజప్ప, రామకృష్ణ మొక్కలు నాటారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీను, కార్యదర్శిగా మొగిలి అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా కొత్త భైరవకృష్ణ, కోశాధికారిగా పెద్దిరెడ్డి బాబ్జి బాధ్యతలు చేపట్టారు. అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు అంబటి రామకృష్ణారెడ్డి మిల్లర్లు పాల్గొన్నారు.

నున్న రామకృష్ణకు అభినందనలు

సామర్లకోట, జూలై 1: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేట్లపాలెం ఆదిలక్ష్మీ ఇండస్ట్రీస్ అధినేత నున్న రామకృష్ణ కాకినాడలో పదవీ బాధ్యతలు చేపట్టారు. సామర్లకోట, పెద్దాపురం మండలాల టీడీపీ నాయకులు, మిల్లర్లు శాలువాలు కప్పి పూలమాలలు వేసి అభినందించారు. పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీను, బీవీఆర్.కృష్ణారావు, వల్లూరి సూరిబాబు, అంబటి రామకృష్ణారెడ్డి, చింతల శ్రీను, గుమ్మళ్ళ సత్యనారాయణ, జొన్నాడ బాబూరావు, కొండపల్లి కృష్ణమూర్తి, తోటకూర శ్రీనివాస్,గోలి ప్రసాద్ తదితరులున్నారు.

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 1: వాతావరణ పరిస్థితుల మార్పు దృష్ట్యా గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పీఎస్ పూడిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నపిల్లలు పట్ల వైద్య బృందం ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కోరారు. కార్యక్రమంలో పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యశశ్విన్, ఎన్జీవో సంఘ నియోజకవర్గ నాయకుడు రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: అతిసార వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారుల ఆధ్వర్యంలో లింగంపర్తి గ్రామంలో వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యులు పాపారావు, సర్పంచ్ యార్లగడ్డ చంద్రశేఖర్, ఎంపీటీసీలు వరుపుల దుర్గా వేణి, అలమండ నాగు, పెంటకోట మోహన్, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట శ్రీధర్, సుబ్బరాజు,చిక్కాల లక్ష్మణరావు ఉన్నారు.



ఏలేశ్వరం:లింగంపర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అవగాహనతోనే డయేరియా నివారణ : ఎమ్మెల్యే దివ్య

తొండంగి: అవగాహనతోనే డయేరియా వ్యాధి నివారణ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తొండంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాప్ డయేరియా అవగాహనా ర్యాలీని ఆమె ప్రారంభించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. స్టాప్ డయేరియాకు కరపత్రాలను, పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీడీపీ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, సుర్ల లోవారాజు, కోడ వెంకటరమణ, నేమాల కృష్ణ, సోమాల ప్రసాద్, నర్శింహమూర్తి పాల్గొన్నారు.

రౌతులపూడి: స్టాప్ డయేరియాను ప్రజలు సద్వినియోగం చేసుకోవలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్ తమరాల సత్యనారాయణ అన్నారు. మూలగపూడిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్టాఫ్ డయేరియా శిబిరం నిర్వహించగా ఎంపీపీ, సర్పంచ్ ప్రారంభించారు. వైద్యులు కే.సరోజ, జి.సౌందర్య జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యామల సురేస్, గాడిరాంబాబు తదితరులున్నారు.

కిర్లంపూడి: మండలంలోని రమణయ్యపేటలో పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో సర్పంచ్ శ్రీలత రాంబాబు అధ్యక్షతన డయేరియాపై అవగాహన నిర్వహించారు. ఎంపీపీ తోట రవి హాజరై డయేరియాను అరికట్టేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, తోట గాంధీ, గుడాల రాంబాబు, వెంకటేష్ ఉన్నారు.

పెద్దాపురం: మండల పరిధిలోని కట్టమూరు ఆరోగ్య కేంద్రంలో డయేరియా వ్యాప్తిపై ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మేడిది శ్రీనివాస్, సానిపిని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'డెంగీ వ్యాధిని నివారిద్దాం'

జీజీహెచ్ (కాకినాడ), జూలై 1: పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీరు లేకుండా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించి సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కాకినాడ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ మాసోత్సవాలు జూలై 1 నుంచి 31 వరకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఇంచార్జి జోనల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.



డెంగీ వ్యతిరేక పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

శృంగారవల్లభస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.33.82 లక్షలు

పెద్దాపురం, జూలై 1: పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయం హుండీల ఆదాయాన్ని సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించారు. 103 రోజులకు గాను హుండీల ద్వారా ఆదాయంగా రూ.26,97,425లు లభించగా, అన్నదాన హుండీల ద్వారా రూ.6,85,052 లభించింది. దీంతో మొత్తం రూ.33,82,477 ఆదాయం లభించిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్వీ.చందన, చల్లా ఉదయబాబునాయుడు, జోకా సత్యనారాయణ, అర్చకులు పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, భక్త సంఘం పాల్గొన్నారు.